
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
శనివారం 13 జూలై 2024







ఉండి మండలం భవానీపురం రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, గుమ్ములూరు సెంటర్‌లో హైవేపై విద్యుత్ వైర్లపై పడిన చెట్టు కొమ్మలు

ఈదురుగాలులు.. భారీ వర్షం

- ఆకివీడు, ఉండిలలో కూలిన హోర్డింగ్స్, చెట్ల కొమ్మలు..
- పూడుకుపోయిన డ్రెయిన్లు..



ఆకివీడు/ఉండి/తణుకు, జూలై 12: ఆకివీడులో శుక్రవారం తెల్లవారుజామున అతి వేగంతో వీచిన ఈదురు గాలులు, మెరుపులతో 45 నిమిషాలపాటు కురిసిన భారీ వర్షానికి అతలాకుతలమైంది. గాలులకు పలుచోట్ల హోర్డింగ్‌లు, చెట్లు విరిగిపడ్డాయి. గుమ్ములూరు సెంటర్‌లో జాతీయ రహదారిపై వున్న కరెంటు వైర్లపై చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. పట్టణ పరిధిలోని ప్రధాన డ్రెయిన్లు ఆక్రమణకు గురై పూడుకు పోవడంతో మురుగునీరు పొంగి రోడ్లన్నీ కాల్వలను తలపించాయి. పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు ఇళ్ళలోకి చేరింది. ఈ వర్షానికి ఉండి నుంచి వెలివర్రు అమ్మవారు ఆలయం నుంచి మహదేవపట్నం గ్రామానికి వెళ్లే రహదారి పెద్ద పెద్ద గోతులుగా మారడంతో అందులో నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉండి, వెలివర్రు, చెరుకువాడ, వాండ్రం, పెదపుల్లేరు, చినపుల్లేరు, అర్తమూరు తదితర గ్రామాలలో వర్షపు నీరు రహదారులపైకి చేరి అధ్వాన్నంగా మారాయి. ఈ గోతులను పూడ్చి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. భారీ వర్షానికి గాలులకు చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది.



ఉండి మండలం వెలివర్రులో సీసీ రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వానొస్తే ఇంతే..

వర్షం వస్తే తణుకు మండలం దువ్వ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు తిప్పలు తప్పవు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన స్కూలు కావడంతో ప్రాంగణం అంతా పల్లంగా ఉంది. తర్వాత జాతీయ రహదారి నిర్మాణం, చుట్టుపక్కల నిర్మాణాలు ఎత్తుగా ఉండటం, వర్షం వచ్చినపుడు రోడ్డు మీద నీరంతా స్కూలు ప్రాంగణంలోకి చేరుతోంది. ఆ నీరు తరగతి గదుల వరకు చేరడంతో అందులోనే నడుస్తూ విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్ళాలి. ఈ పరిస్థితి నుంచి ఎప్పుడు విముక్తి కలుగుతుందోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. నిలిచిన నీరు పూడుకుపోయిన డ్రెయిన్ల ప్రాంతంలో జేసీబీలతో తొలగించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో స్కూలు ప్రాంగణంలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వారధి టెండర్లు మళ్లీ వాయిదా

నరసాపురం, జూలై 12: వశిష్ఠ వారధి టెండర్లు ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసినట్లు జాతీయ రహదారుల శాఖ ఈఈ శ్రీనివాసులు చెప్పారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల మధ్య రామేశ్వరం-నరసాపురం మండలం రాజులంక వద్ద వారధి నిర్మాణానికి గత ఏడాది ఆగస్టులో టెండర్లు పిలిచారు. భూసేకరణపై కొందరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో టెండర్లు తెరవకుండా ఎన్‌హెచ్ అధికారులు వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈసారి ఇదే కారణంతో వాయిదా వేయడం ఇది 11వ సారి. మరోవైపు వారధి రూటు మార్చా లని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే బీజేపీ నాయకులు కేంద్ర ఆర్థిక మంత్రులు నిర్మలా సీతారామన్, శ్రీనివాస్ వర్మలను కలిసి వారధి నిర్మాణం నరసాపురం పట్టణ సమీపంలో చేపట్టాలని విన్నవించారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి.. పట్టణానికి ఐదు కిలో మీటర్ల దూరంలో వంతెన నిర్మిస్తే ప్రజలకు ఏ విధమైన ఉపయోగం ఉండ దని, 2017లో ఆమోదించిన డిజైన్ ప్రకారం వారధి, 216 బైపాస్ జాతీయ రహదారి పనులు చేపట్టాలని కోరారు. దీంతో న్యాయపరమైన ఇబ్బందులు పరిష్కారమైనా మళ్లీ డిజైన్‌ను మారిస్తే టెండర్లు పూర్తిగా రద్దయే అవకాశం ఉంది.



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో.. అందుబాటులోకి సిటీ స్కాన్

ఏలూరు క్రైం, జూలై 12 : ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సిటీస్కాన్ పనిచేయడం లేదని 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 11న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నెల 6 నుంచి సిటీ స్కాన్ సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తి పనిచేయలేదు. సంబంధిత కంపెనీ ఇంజనీర్లు వచ్చి చూశారు. అయినప్పటికీ కాలయాపన చేస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు సత్వర చర్యలు చేపట్టి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయించి సంబంధిత ఇంజనీర్ల ద్వారా మరమ్మతులు చేయించారు. శుక్రవారం ఉదయం నుంచి సిటీ స్కాన్‌ను యథావిధిగా రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చి 80 స్కాన్‌లు తీశారు.



పాలకోడేరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఇసుక అందుబాటులోకి తేవాలి : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 12:జిల్లావాసులకు ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని అనుమతులను వెంటనే పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గోదావరి రివర్ కన్జర్వేటర్, గనులు శాఖ అధికారులతో ఇసుక సరఫరాపై సమీక్షించారు. అనుమతులు పొందడంలో తాత్సరం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలి, నరసా పురం గోదావరి పరివాహక ప్రాంతంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్స్‌ను యుద్ధ ప్రాతిపదికన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన సీటీఈ, సీటీవో కాలుష్య నియంత్రణ, పర్యావరణ అనుమతులను పొందడానికి వెంటనే ప్రతిపాదనలను సమర్పించాలన్నారు. గోదావరి రివర్ కన్జర్వేటర్ విశ్వేశ్వరరావు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు. టిడ్కో ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌అండ్‌టి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ 'టిడ్కో ఇళ్ళ నిర్మాణాలలో చివరి దశ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలి. జిల్లాలో 19,872 ఇళ్లకు 8,736 పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాం. మిగిలిన 11,136లో 90 శాతంపైగా 4,668 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. నూరు శాతం పనులను త్వరగా పూర్తి చేయాలి. భీమవరంలో 5,408, తాడేపల్లిగూడెంలో 2,144, పాలకొల్లులో 2,560 ఇళ్లను పూర్తి చేయాల్సి వుంది. ఇప్పటికే అప్పగించిన గృహ సముదాయాలలో డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలి' అని ఆదేశించారు. టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏమ్.ఎస్ స్వామినాయుడు, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్లు ఎం.శ్యామల, డి.మురళీకృష్ణ, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ.. విద్యార్థులతో భోజనం

పాలకోడేరు, జూలై 12 : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందిస్తూ ఆసుపత్రిలోనే సుఖప్రసవాలు జరిగే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలకోడేరు పీహెచ్‌సీని శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఉద్యోగుల హాజరు పట్టీని, ఆసుపత్రిలో నిర్వహించే ఓపీ బుక్, ఇన్‌పేషెంట్ల బుక్, డెలివరి రూమ్, మందులు ఇచ్చే గదిని పరిశీలించారు. అనంతరం పాలకోడేరు జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు, విద్యాశాఖ ఏడీ సత్యనారాయణ, ఎంఈవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హార్బర్ కథ ఏమైంది !

- రెండేళ్ల క్రితం జగన్ శంకుస్థాపన
- రూ.394 కోట్లు అంచనా.. కేంద్ర అనుమతి కోసం ప్రతిపాదన
- అనుకూలత లేదన్న నిపుణుల బృందం



7

ఏటా ఖరీఫ్‌లో భారీ వర్షాలు పడినా.. గోదావరిలో వరద ప్రవాహం పెరిగినా.. నక్కల డ్రయిన్ పొంగి రైతులను నట్టేట ముంచుతోంది. వరదల సమయంలో డ్రెయిన్ పరిధిలోని వేలాది ఎకరాల వరి ఆయకట్టు ముంపు బారిన పడుతోంది. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం మురుగు, పంట కాలువల సమస్యలపై కనీసం దృష్టి సారించలేదు. ఈ కారణంగా వేలాది ఎకరాల వరి చేలు నీట మునిగి కుళ్లి రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు.



నక్కల డ్రెయిన్.. వడ్డిలంక వద్ద నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్



ముంపుతో మునిగారు

ఐదేళ్లుగా నక్కల డ్రెయిన్‌తో రైతుల పాట్లు

- వరదల సమయంలో మొరాయిస్తున్న నక్కల అవుట్ ఫాల్స్ గేట్లు
- వరద వస్తే వేలాది ఎకరాల వరి మునక.. అన్నదాతలకు తీవ్ర నష్టం
- టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.17 కోట్లతో గబియన్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం
- జగన్ సర్కార్ రాకతో పనులు నిలిపివేత
- కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో చిగురించిన ఆశలు

యలమంచిలి, జూలై 12 : తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు వద్ద మొదలైన నక్కల డ్రయిన్ సుమారు 40 కిలోమీటర్లు ప్రవహించి యలమంచిలి మండలం వడ్డిలంక గ్రామం వద్ద గోదావరిలో కలుస్తోంది. ఈ మురుగు కాలువపై ఆధారపడి సుమారు 42 వేల ఎకరాల ఆయకట్టులో వరి సాగవుతోంది. దాదాపు ప్రతి ఏడాది సార్వాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అధిక వర్షాలు పడటం.. దీనికితోడు గోదావరి వరద రావడంతో నక్కల డ్రెయిన్ పొంగి పొర్లడం పరిపాటిగా మారింది. గుర్రపు డెక్క, తూడు పెరిగిపోయి నక్కల డ్రెయిన్‌లో మురుగునీరు స్తంభించడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువను ఆనుకుని ఉన్న వరి చేలల్లో మురుగు నీరు బయటకు పారక చేలల్లోనే తిష్ఠ వేయడంతో రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. నక్కల డ్రెయిన్ శివారులో వడ్డిలంక వద్ద ఉన్న నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్‌కు ఉన్న కొన్ని తలుపులు కొన్నేళ్లుగా వరద సమయంలో మొరాయిస్తున్నాయి. దీంతో వరద నీరు మురుగు కాలువలోకి ఎగదన్నడంతో వరి చేలు పూర్తిగా నీట మునుగుతున్నాయి. నక్కల డ్రయిన్‌ను ఆనుకుని ఉన్న ఆయకట్టులో ముఖ్యంగా ఆచంట, ఆచంట వేమవరం, గుమ్ములూరు, వద్దిపర్రు, కాంబోట్లపాలెం, గుంపర్రు, చింతదిబ్బ, కట్టుపాలెం, వడ్డిలంక గ్రామాల పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాల వరి చేలు ముంపు బారినపడి పూర్తిగా దెబ్బ తింటున్నాయి. ఈ నేపథ్యంలో ముంపు బారిన పడిన చేలు చెరువులను తలపించేలా దర్శనమివ్వడం గమనార్హం. అధికంగా వర్షాలు పడటం, గోదావరికి వరద ఉధృతంగా వస్తే ఈ ప్రాంతాల్లోని రైతులు వరి పంటపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఈ ప్రాంతాల్లో గత ఐదేళ్లలో ఎకరాకు రూ.15 వేలు పైబడి పెట్టుబడి పెట్టిన వరి చేలు ముంపునకు గురై పూర్తి స్థాయిలో నష్టపోయామని రైతులు వాపోతున్నారు. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చ లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లుగా ఆగిన వాల్ నిర్మాణం

నక్కల డ్రయిన్ ముంపు సమస్య పరిష్కారానికి గత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపి రూ.17 కోట్ల అంచనాలతో గబియన్‌వాల్ నిర్మాణ పనులు 2019లో ప్రారంభించారు. సుమారు 2.5 కిలోమీటర్ల మేర గబియన్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు జరిగాయి. గబియన్ వాల్ నిర్మాణంతో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో మురుగు కాలువ, గట్లు పటిష్ఠం అవుతాయని దీంతో ముంపు సమస్య తీరునుందని అప్పట్లో రైతాంగం ఆశ పడ్డారు. తొమ్మిది శాతం మాత్రమే పనులు పూర్తయిన దశలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అనంతరం ఆ ప్రభుత్వం వాల్ నిర్మాణ పనులను నిలిపివేసింది. దీంతో సమస్య పరిష్కారం అవుతుందన్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఐదేళ్లుగా ముంపు సమస్యను పట్టించుకున్న నాథుడే లేడని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తాయి. వరదల సమయంలో నాయకులు, అధికారులు వచ్చి వెళ్లారే తప్ప.. మిగిలిన కాలంలో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఏ విధమైన చర్యలు చేపట్టలేదని రైతులు విమర్శిస్తున్నారు.

నీటిని ఎత్తిపోస్తే ముంపు తప్పినట్లే

వడ్డిలంక నక్కల అవుట్ ఫాల్స్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. కాలువల్లో నీటి ఎద్దడి వస్తే ఈ ఎత్తిపోతల పథకం ద్వారా కాలువల్లోకి నీటిని సరఫరా చేయడమే దీని ముఖ్యోద్దేశం. అనంతరం నీటి ఎద్దడి తలెత్తిన సందర్భాల్లో ఇక్కడి నుంచి లిఫ్ట్ చేసిన నీటిని చేలకు పెట్టామని.. ఈ నీటిలో ఉప్పు శాతం అధికంగా ఉండటంతో దిగుబడులు తగ్గిపోయి నష్టపోయామని రైతులు అప్పట్లో వాపోయారు. దీంతో ఇక్కడ ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. ఇదిలా ఉంటే వరదల సమయంలో ఈ ఎత్తిపోతల పథకాన్ని ఉపయోగించి నక్కల డ్రెయిన్‌లో నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తే చేల ముంపు సమస్య తీవ్రతను తగ్గించవచ్చని రైతు సంఘాల నాయకులు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రక్రియ చేపట్టాలంటే ఎత్తిపోతల వద్ద ప్రత్యేక పైపులైన్‌ను ఏర్పాటు చేయాలి. ఈ విధానం సాధ్యమవుతుందా.. లేదా అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

నిమ్మలపైనే ఆశలు

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆదేశాలతో పలు డ్రెయిన్ల ప్రక్షాళన పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. దీంతో ఈ డ్రెయిన్ ఆధునికీకరణ, ప్రక్షాళన, అవుట్‌ఫాల్స్ గేట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్లూయిజ్ వద్ద ఊడిన తలుపులు

2021 సెప్టెంబరులో వరద ఉధృతి ఉన్న సమయంలో స్లూయిజ్‌కు ఉన్న తలుపుల్లో ఒకటి ఊడిపోయింది. ఇరిగేషన్ అధికారులు ఆ తలుపు స్థానంలో మరో తలుపును డమ్మీగా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వడ్డిలంక, చింత దిబ్బ, గుంపర్రు, కాంబోట్ల పాలెం గ్రామాల పరిధిలోని నక్కల డ్రయిన్‌ను అనుకుని ఉన్న వరి పంట నీట మునిగింది. నిర్వహణ లేకపోవడమే కారణమని స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా సకాలంలో స్లూయిజ్ నిర్వహణ చేపడితే తలుపులు మొరాయించడం వంటి సమస్యలు తలెత్తవని రైతులు అభిప్రాయపడుతు న్నారు. గత ఏడాది గేట్లకు తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఊడిపోయిన తలుపును తిరిగి అమర్చేందుకు ఇరిగేషన్ అధికారులు పలు మార్లు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం గమనార్హం.



మొరాయిస్తున్న తలుపులు



కొంతేరు ఆవ డ్రెయిన్‌లో డ్రోన్‌తో రసాయనాలు వెదజల్లుతున్న పనులను పరిశీలిస్తున్న మంత్రి

జగన్‌ను రైతులు శాశ్వతంగా మర్చిపోవాలి : మంత్రి నిమ్మల

యలమంచిలి, జూలై 12: వ్యవసాయాన్ని, రైతుల సంక్షేమాన్ని మరిచిపోయిన జగన్‌ను రైతులు కూడా శాశ్వతంగా మర్చిపోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. యలమంచిలి మండలం కొంతేరులో శుక్రవారం ఆవ డ్రయిన్‌లో గుర్రపు డెక్క, తూడు తొలగింపునకు మంత్రి కొబ్బరికాయ కొట్టి డ్రోన్ ద్వారా రసాయనం చల్లే పనులను ప్రారంభించి మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు రైతులకు మేలు జరిగేలా మురుగు కాల్వల ప్రక్షాళనకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. రాష్ట్రంలో 960 పనులకు రూ.90 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నాం. జగన్ ఐదేళ్లలో పంట కాల్వలు, డ్రెయిన్లను నిర్లక్ష్యం చేసి అస్తవ్యస్తం చేసి, రైతులను నష్టాల ఊబిలోకి నెట్టేశాడు. మేం అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే పంట, మురుగు కాల్వల ప్రక్షాళన పనులకు శ్రీకారం చుట్టాం' అని అన్నారు. డ్రెయిన్ల శాఖ ఈఈ ఎం.కిశోర్, డీఈ వి.వినోద్‌చంద్, ఏఈ ఉదయ శంకర్, దుర్గారావు, మామిడిశెట్టి పెద్దిరాజు, ఆరుమిల్లి చిన్ని, తాళ్లూరి సత్యశ్రీను, బొప్పన హరికిషోర్, బోనం నాని, ఉన్నమట్ల కబర్ధి తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేసినా ఇంకా అక్కడే

- మారని ఉద్యాన వర్సిటీ మాజీ వీసీ తీరు
- భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే బొలిశెట్టి ఫైర్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12 : వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వ విద్యాలయం ఉప కులపతిగా డాక్టర్ టి.జానకిరామ్ నియామకం చెల్లదంటూ పక్షం రోజుల క్రితం హైకోర్టు తీర్పు ఇచ్చినా.. ఆయన ఆ పదవి నుంచి వైదొలగలేదు. ఓ వైపు ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉంటూ.. వర్శిటీ కారులోనే తిరుగుతూ.. విధులు కొనసాగిస్తూనే ఉన్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఫోన్ చేసి హైకోర్టు తీర్పును గౌరవించి, పదవి నుంచి వైదొలగాలని సూచించారు. దీంతో ఆయన తన ఉప కులపతి పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికే ఆయన పదవి కాలంలో నిధుల దుర్వినియోగం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు, వర్శిటీ ఉన్నత పదవుల నియామకంలో పక్షపాతం చూపించారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వర్శిటీని సందర్శించిన ఆయన అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. జగన్ ప్రభుత్వంలో ఉద్యాన విశ్వ విద్యాలయాన్ని అన్ని రకాలుగా నాశనం చేశారని విమర్శించారు. ఐదేళ్లపాటు మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని విద్యార్థులు నేరుగా తనకే ఫోన్లు చేసి చెప్పడం వర్శిటీ పనితీరుకు నిదర్శనమన్నారు. స్థానిక మంత్రి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు తీసుకుని ఔట్ సోర్సింగ్ పోస్టులు వేయించారని, వారిని సాగనంపుతామన్నారు. పదవి నుంచి వైదొలగిన వీసీ క్వార్టర్‌ను ఖాళీ చేసేలా చర్యలు తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులుకు సూచించారు. ఫర్నీచర్ కొనుగోలులో కోటిన్నర దుర్వినియోగం అయినట్టు ఆరోపణలు ఉన్నాయని, వాటి వివరాలు అందించాలని ఆదేశించారు.



ఉద్యాన వర్సిటీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

రెడ్‌క్రాస్‌కు అవినీతి మరకలు

- మాజీ చైర్మన్ జేపీ, మాజీ మంత్రి నానిపై విచారణకు డిమాండ్.. ధర్నా

ఏలూరు రూరల్, జూలై 12 : రెడ్‌క్రాస్‌ను భ్రష్టు పట్టించి కోట్ల రూపాయలు దిగమింగిన మాజీ చైర్మన్ మామిళ్ళపల్లి జయప్రకాష్, అతనికి సహకరించిన అప్పటి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ళ నానిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రెడ్‌క్రాస్ సంస్థలో కొవిడ్ సమయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారాన్ని బహిర్గతం చేసి, దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థకు అవినీతి మరకలు అంటించిన జేపీపై విచారణకు డిమాండ్ చేశారు. జాలా శివశంకర్, బోడా కిరణ్ పాల్గొన్నారు.



హార్బర్ కథ ఏమైంది !


బియ్యపుతిప్ప వద్ద హార్బర్ కోసం సేకరించిన స్థలం

రెండేళ్ల క్రితం జగన్‌మోహన్ రెడ్డి బియ్యపు తిప్పవద్ద శంకుస్థాపన

రూ.394 కోట్లు అంచనా.. కేంద్ర అనుమతి కోసం ప్రతిపాదన

అనుకూలత లేదన్న నిపుణుల బృందం

ల్యాండ్ ఫిల్లింగ్ సెంటర్ కోసం టీడీపీ హయాంలో నిర్ణయం

రూ. 18 కోట్లు కేటాయింపు.. రూ. 2 కోట్లతో పనులు

వైసీపీ వచ్చాక హార్బర్ అంటూ హడావుడి

రాష్ట్ర నిధులతోనే నిర్మాణం చేపడతామంటూ ప్రగల్భాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

నర్సాపురం తీరప్రాంతంలో బియ్యపు తిప్పవద్ద హార్బర్ నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఏజెన్సీని ఖరారు చేసినట్టు ప్రకటించారు. హార్బర్ అందుబాటులోకి వస్తుందంటూ నమ్మించారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కపైసా మంజూరు చేయలేదు. మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు బియ్యపు తిప్పవద్ద ధర్నా చేస్తే పనులు చేస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. కేంద్ర అనుమతి కోసం ప్రాజెక్ట్ నివేదికను పంపినా అనుమతి రాలేదు. కేంద్రం అంగీకరిస్తేనే నిధులు మంజూరు కానున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో హార్బర్ నిర్మా ణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉంది.రాష్ట్ర విభజనలో భాగంగా హార్బర్‌లు నిర్మించే బాధ్యత కేంద్రంపై ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వమే దీనిని నిర్మిస్తుందంటూ గతంలో వైసీపీ ప్రభుత్వం ముందుకొచ్చింది. జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తీరా మళ్లీ కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపారు.

నో చెప్పిన నిపుణుల బృందం

తెలుగుదేశం కూటమి 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు హార్బర్‌లపై ప్రతిపాదన పంపింది. అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని హార్బర్ ప్రతి పాదిత ప్రాంతాలను సందర్శించింది. బియ్యపుతిప్ప హార్బర్ తప్ప మిగిలిన వాటికి ఓకే చెప్పింది. బియ్యపు తిప్పవద్ద మాత్రం అనుకూలంగా లేదని తేల్చేసింది. గోదావరి నది సముద్రంలో కలిసే ప్రాంతానికి దగ్గరగా బియ్యపు తిప్ప ఉండడంతో ఆటుపోట్లు అధికం. ఫలితంగా ఇసుక మేటలు వేస్తుం టాయి. మరోవైపు తీరప్రాంతం కోతకు గురవుతుంటుంది. హార్బర్‌కు కూడా అదే ముప్పు పొంచి ఉందంటూ కేంద్ర నిపుణుల బృందం స్పష్టం చేసింది. దాంతో అప్పటి తెలుగుదేశం ప్రత్యామ్నాయంగా ల్యాండ్ ఫిల్లింగ్ కేంద్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. దాదాపు రూ.18 కోట్లు కేటాయించింది. అప్పట్లోనే రూ.2 కోట్లు వెచ్చించి పనులు ప్రారంభించారు. బోట్లు ఉంచేందుకు ఆ సెంటర్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం నర్సాపురం లాకుల వద్ద బోట్లు నిలుపుతున్నారు. దీనివల్ల మత్స్యకారులు వేటకు వెళ్లడానికి వ్యయప్రయాసలు పడుతున్నారు.ఈ సమస్యలను అధిగమించేందుకు టీడీపీ ప్రభుత్వం హార్బర్‌కు బదులుగా బియ్యపు తిప్ప వద్ద ల్యాండ్ ఫిల్లింగ్‌కు సిద్ధమయ్యారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ హార్బర్‌ను తెరపైకి తెచ్చింది. నిపుణుల బృందం గతంలో సమ్మతించ లేదు. ఇప్పుడేం చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



పరశురామునిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల, జూలై 12: పరశురాముని అలంకరణలో జగన్నాథుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో కమండలాన్ని ధరించి ఉన్న పరశురామ అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. శ్రీవారి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని రోజుకో అలంకారం చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.


వడలిలో పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేశ్వరరావు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ, జూలై 12: సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేశ్వరరావు అన్నారు. సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో శుక్రవారం వడలి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జ్వరాల కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతీ రోజూ ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. తామరాడ గ్రామంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుడా చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్యామల, భృంగేశ్వరరావు, పి.లక్ష్మి దుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.


రామన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న బృంద సభ్యులతో వైద్య సిబ్బంది (ఫైల్ ఫొటో)

రామన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వ నాణ్యతా ప్రమాణ పత్రం

మొగల్తూరు, జూలై 12: మొగల్తూరు మండలం రామన్నపాలెం 1వ సచివాలయ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్ర ప్రభుత్వం జాతీయ నాణ్యతా హామీ ప్రమాణ పత్రం సాధించిందని మొగల్తూరు ఆసుపత్రి వైద్యులు దినేష్, లక్ష్మీపార్వతిలు శుక్రవారం తెలిపారు. రామన్నపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను గత నెలలో డిల్లీలోని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన (ఎస్‌కాస్) జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ సభ్యులు సందర్శించారన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో సదుపాయాలు, రోగికి అందిస్తున్న సేవలు, ఆరోగ్య పరిరక్షణ, వ్యాధి నియంత్రణ, నాణ్యత, నిర్వహణ తదితర 8 అంశాలను పరిశీలించి విశ్లేషణ చేసి నూటికి 84 శాతం మార్కులు ఇచ్చారన్నారు. మార్కులకు అనుగుణంగా సంస్థ ఉన్నతాధికారులు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణపత్రాన్ని గురువారం అందించారని వైద్యులు తెలిపారు. సర్పంచ్ బందెల ఎలీషా, ఉప సర్పంచ్ మేకల పరుశరామ్, గ్రామపెద్దలు లక్ష్మణరావు, కుక్కల మోహనరావు తదితరులు వైద్య సిబ్బందిని అభినందించారు.

పీఎఫ్, ఈఎస్ఐ కట్టకపోతే 20 నుంచి సమ్మె

ఏలూరు క్రైం, జూలై 12 : ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధిత థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములను కట్టకపోతే ఈనెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ప్రకటించారు. జిల్లాలోని ఏలూరు ప్రభుత్వాసుపత్రి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, బుట్టాయిగూడెం, పోలవరం, దెందులూరు, భీమడోలు ఆసుపత్రులలో పనిచేస్తున్న శానిటరీ వర్కర్లకు కాంట్రాక్టర్ దాదాపు 17 నెలలు పీఎఫ్, ఈఎస్ఐ కట్టకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. తాము సంబంధిత అధికారులకు ఈ ఏడాది మార్చి 29న ఫిర్యాదు చేయగా నెలరోజుల్లో చెల్లిస్తామంటూ ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన సంబంధిత కాంట్రాక్టర్ హామీ లెటరు ఇచ్చారని అయినప్పటికీ ఇంత వరకూ చెల్లించలేదన్నారు. వచ్చేనెల ఆగస్టుతో కాంట్రాక్టు ముగిసిపోతుందని ఒక్కో కార్మికునికి రూ.50 వేల వరకూ కాంట్రాక్టర్ చెల్లించాలని అవి చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 20లోపు పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములను చెల్లించకపోతే శానిటరీ కార్మికులు సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు.

కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలి

కైకలూరు జూలై 12 : ప్రతీ కౌలుదారుడు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, అప్పుడే ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే నష్టపరిహారాలు నేరుగా కౌలుదారునికే అందుతాయని వ్యవసాయశాఖ ఏడీ ఆర్.గంగాధరరావు అన్నారు. శుక్రవారం వేమవరప్పాడులో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ కౌలుదారుడు భూయజమాని అంగీకారంతో కౌలు గుర్తింపుకార్డు తీసుకోవాలని దీని వల్ల కౌలు రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పలు పథకాలు అందుతాయన్నారు. కార్డు తీసుకోవడం వల్ల భూయజమానికి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు.ఈ కార్డు పదకొండు నెలల కాలపరిమితికి మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతు ఆధారుకార్డు జిరాక్సు, పాస్‌పోర్ట్ ఫొటో, భూయజమాని పొలం పాస్‌బుక్ జిరాక్సు కాపీలను వీఆర్వో, వీఏఏలకు అందజేయాలన్నారు.


శిథిలమైన కేశవరం బ్రెయిలీ బ్రిడ్జి..

క్షణం..క్షణం భయం..భయం

- శిథిలావస్థలో కేశవరం బ్రెయిలీ బ్రిడ్జి
- ఏ క్షణంలోనైనా కుప్పకూలేందుకు సిద్ధం
- టీడీపీ హయాంలో నిర్మాణానికి నిధులు
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలి

గణపవరం, జూలై 12: గణపవరం మండలం కేశవరం ఉండి పంట కాల్వపై ఉన్న బ్రెయిలీ బ్రిడ్జి కుప్పకూలేందుకు సిద్ధంగా ఉంది. గణపవరం మండల కార్యాలయాలకు ఈ వంతెనపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఉండిపంట కాల్వపై బ్రిటిష్ ప్రభుత్వం నిర్మించిన వంతెన కూలిపోయి 14 సంవత్సరాలైంది. 2009లో అప్పటి మంత్రి వట్టి వసంతకుమార్ బ్రెయిలీ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తదుపరి వైసీపీ ప్రభుత్వం రావడంతో వంతెన నిర్మాణ పనులు అటకెక్కించేశారు. అప్పటి నుంచి నేటి వరకు నిర్మాణం జరగలేదు. ఈ బ్రిడ్జిపై పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడటంతో రాకపోకలు సాగించాలంటే ప్రాణాలు పైనే పోతున్నాయని అంటున్నారు. వంతెన రంధ్రాల్లోకి కాళ్లు చొచ్చుకుపోయి రేకులు గీసుకుపోయిన సంఘటనలు జరిగాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జల్లికాకినాడ, అప్పన్నపేట, మల్లపురాజుపేట గ్రామాల నుంచి ఈ వంతెన పైనే విద్యార్థులు కేశవరం హైస్కూల్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన పరిస్థితి చూసి హడలిపోతున్నారు. కేశవరం స్కూల్‌కి వెళ్లాలంటే పది కిలోమీటర్లు చుట్టి రావాల్సి వస్తుందన్నారు. అలాగే పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడటంతో పాఠశాలల బస్సులు కానీ, ఆక్వా వాహనాల రాకపోకలు కూడా జరిగే పరిస్థితులు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇంత దీనస్థితిలో ఉన్న బ్రిడ్జికు కనీస మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. నూతన వంతెన నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నా అవి కాగితాలకే పరిమితం అయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ, వామపక్షాలు అనేక సార్లు వంతెన నిర్మాణానికి, కనీస మరమ్మతులకు అనేకసార్లు పోరాటాలు చేసినప్పటికి పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ఆరోపణలు మూట గట్టుకున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జికి కనీస మరమ్మతులు చేసి రాకపోకలకు అవరోధం లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం



కేశవరం బ్రిడ్జి పూర్తిగా శిథిలమైంది. పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులు గాలికి వదిలేసింది. విద్యార్థులు ఈ వంతెనపై రాక పోకలకు భయపడుతున్నారు. దాతల సహకారంతో రంధ్రాలు పూడ్చినా వంతెన మరింత శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం మరమ్మతులైనా చేపట్టి వంతెన నిర్మాణానికి కృషి చేయాలి.

-ఇందుకూరి రామకృష్ణంరాజు, గణపవరం టీడీపీ అధ్యక్షుడు

● నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి



కేశవరం వంతెన నిర్మిస్తామని గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గణపవరంలో సభలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు. కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఐదేళ్లు దాటినా ఎటువంటి ప్రతిపాదనలు లేవు. వంతెనపై గోతులు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చుట్టుతిరిగి రావాలంటే పది కిలో మీటర్లు అదనంగా రావల్సి ఉంటుంది. నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి.

-యాళ్ళ కల్యాణి, మాజీ సర్పంచ్, అప్పన్నపేట


స్పిల్వే వద్ద గోదావరి ఉధృతి

పెరిగిన గోదావరి

పోలవరం, జూలై 12 : పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదుల నుంచి వస్తున్న వరద జలాలతో గోదావరిలో నీటిమట్టం రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతోంది. స్పిల్వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.970 మీటర్లు, స్పిల్వే దిగువన 17.060 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.050 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 16.080 మీటర్లు నమోదైనట్లు ఈఈలు వెంకటరమణ, మల్లిఖార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,080 క్యూసెక్కుల నీరు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి శుక్రవారం 7,080 క్యూసెక్కుల వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.387 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20 పంపులు 20 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఎస్‌కేఎస్‌డీలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ ఉషారాణి

తణుకు, జూలై 12 : జాతీయస్థాయిలో విజేతలైన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ, అంత ర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. శుక్రవారం కళాశాల ఇండోర్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. జిల్లా సెక్రటరీ మెంటే వంశీకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ విజేతలైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. తణుకు పరిసర ప్రాంత క్రీడాకారులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అన్నారు. టోర్నమెంటుకు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారని టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్ బాబు తెలిపారు. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కెఎస్ఆర్‌పీ ప్రసాదు, కంటిపూడి రాంబాబు, వివేకానంద గ్లోబల్ స్కూలు కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి అసోం వాసి మృతి



ఏలూరు క్రైం, జూలై 12 : రైలులో ప్రయాణిస్తున్న అసోంకు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని తేలప్రోలు రైల్వేస్టేషన్ దాటిన తరువాత రైలు పట్టాల వద్ద ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావుకు సమాచారం అందింది. సిబ్బందితో శుక్రవారం మధ్యాహ్నం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు అసోం రాష్ట్రానికి చెందిన రబ్బా (40)గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జేసీబీ క్రేన్ ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జూలై 12 : రోడ్డుపై నడిచివెళ్తున్న ఒక వృద్ధుడిని జేసీబీ క్రేన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు భగ్గయ్యపేటకు చెందిన ఆది సూరిబాబు (60) ప్లాట్ రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం చాటపర్రు రోడ్డులో టిప్‌టాప్ సామాన్లు రిక్షాపై దించి తిరిగి రోడ్డుపై నడిచి వస్తుండగా జేసీబీ క్రేన్ అతనిని ఢీకొట్టింది. దీంతో గాయాలైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆ తరువాత ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

నరసాపురం రూరల్, జూలై 12; మండలంలోని కొప్పర్రు గ్రామంలో శుక్రవారం లారీ ఢీకొని మోటర్ సైకిలిస్టు సూర్యనారాయణమూర్తి (50) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై గురువయ్య చెప్పారు. గ్రామం నుంచి మృతుడు పట్టణానికి వస్తుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెట్రోల్ పోసుకుని యువకుని ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూలై 12 : ఒక యువకుడు తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు సమీపం లోని కొత్తూరు రోడ్డు ఇందిరమ్మ కాలనీ 9వ రోడ్డునకు చెందిన నువ్వుల రాజ్ విహార్ (30)కి వివాహం కాగా భార్య ఇతనితో గొడవ పడి విడిపోయింది. అప్పటి నుంచి తన తల్లితో కలిసి జీవిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఏలూరులోని వంగాయిగూడెంలో ఉన్న అతని బంధువు ఇంటికి వచ్చి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బంగారం చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, జూలై 12: బంగారం చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. తెడ్లం గ్రామానికి చెందిన చాట్రాతి గణేష్ ఈనెల 7వ తేదీన హైదరాబాద్ వెళ్ళి 11వ తేదీన ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని ఆరు కాసుల బంగారపు వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడు గణేష్ ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

టి.నరసాపురం, జూలై 12: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొత్త ప్రద్యుమ్న సెల్‌ఫోన్‌కి తన ఆధార్ నెంబర్‌తో ముంబయ్ నుంచి తైవాన్‌కు కొరియర్ బుక్ చేశావంటూ తెలియని సెల్ నెంబర్ నుంచి ఒక వ్యక్తి ఫోను చేశాడు. ఆ కొరియర్‌తో తనకు సంబంధం లేదని ప్రద్యుమ్న తెలిపినప్పటికి తాము పోలీసులమని హర్యాణా, గుర్గావ్, పాట్నాలలో కూడా నీకు అకౌంట్లు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని నీ అకౌంట్లో 93 శాతం నగదు బదిలీ చేస్తే 15 నిమిషాల్లో మళ్లీ వెనక్కి పంపుతామని అటు వైపు వ్యక్తి తెలిపాడు. ప్రద్యుమ్న తన అకౌంట్ నుంచి 5.80 లక్షలను బదిలీ చేయగా ఆటువైపు వ్యక్తి సెల్‌ఫోన్ నుంచి బదులు రాకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించాడు. ప్రద్యుమ్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అత్యాచారం కేసులో అరెస్టు

అత్తిలి, జూలై 12 : అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో ఒక మైనర్ బాలికను అత్యాచారం చేశాడనే ఆరోపణపై పోక్సో చట్టం కింద నిందితుడు చిలకలపాటి ప్రవీణ్‌ను తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు అరెస్టు చేశారు. నిందితుడు వీరవాసరం మండలం రాయకుదురు గ్రామంలో తన ఇంట్లో ఉండగా వెళ్లి అరెస్టు చేసినట్లు అత్తిలి ఎస్ఐ రాంబాబు తెలిపారు.

కోళ్లవ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూలై 12 :చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి పెదపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా వాహన డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరుకువాడలో పేకాటపై దాడి

ఉండి జూలై 12: ఉండి మండలం చెరుకువాడ వడ్డిగుడెం ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందండంతో పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోని తీసుకుని రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.


యువతుల నుంచి వివరాలు నమోదు చేస్తున్న డీసీపీవో సూర్యచక్రవేణి

రాజస్థాన్ యువతుల చందా దందా

ఏలూరులో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వసూళ్లు

అదుపులోకి తీసుకున్న డీసీపీవో బృందం

ఏలూరు క్రైం, జూలై 12 : రాజస్థాన్‌కు చెందిన కొంతమంది యువతులను ఒక ముఠా తీసుకు వచ్చి వివిధ ప్రాంతాలకు తిరుగుతూ భిక్షా టన చేయిస్తున్నారు. ఆ ముఠా మాత్రం మ్యాజిక్ బుక్స్ ఇతర బుక్స్ విక్రయించడానికి అంటూ రాజస్థాన్ నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పట్టణాలు, నగరాలకు వస్తున్నారు. ఒక లాడ్జిలో ఉంటూ వివిధ ప్రాంతాలు తిరుగుతూ చందాలు వసూలు చేస్తున్నారు. వారి చేతిలో ఉన్న పుస్తకాలు, పేపర్లులోని చందాల వివరాలు చూస్తే గుండె ఆగి పోవాల్సిందే. ఏకంగా ఐదు వందల నుంచే ప్రారంభం అవుతుంది. అం తకు తక్కువ ఎవరూ ఇచ్చినట్లు కనిపించరు. యువతులు జీన్ ప్యాంట్లు, షర్టులు ధరించి ఏలూరు నగరంలో వివిధ కూడళ్లల్లో, సిగ్నల్ పాయింట్ల వద్ద ఉంటూ యువకుల వద్దకు వెళ్లి చందాలు రాయాలంటూ కోరు తున్నారు. కాదంటే ఈసడించుకుని వెళ్తున్నారు. శుక్రవారం ఇద్దరు యువ తులు ఏకంగా కలెక్టరేట్‌లోకి వెళ్లి మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యాల యంలో ఉన్న ఉద్యోగులను చందాలు ఇవ్వాలనడం విశేషం. మొత్తం మీద మైనర్ యువతులతో భిక్షాటన చేయిస్తున్నారని సమా చారం అందుకున్న జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సీహెచ్ సూర్య చక్రవేణి తన సిబ్బందితో గాలింపు చేపట్టి చివరకు ఆరుగురిని అదుపులోకి తీసుకు న్నారు. వారు రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌కు చెందిన వారుగా ఆధార్ కార్డు లను బట్టి గుర్తించారు. కొంతమంది మైనర్లు కూడా ఈ ముఠాలో ఉన్నారు. తాము పుస్తకాలు విక్రయించడానికి వచ్చామని ఆ పుస్తకాలు ఎవరు కొనుగోలు చేయకపోవడం పట్ల అవన్నీ లాడ్జిలో పెట్టి జీవనం కోసమే భిక్షాటన చేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. అయితే తదుపరి చర్యలు నిమిత్తం ఏలూరు త్రిటౌన్ పోలీసులకు అప్పగించారు. గత ఏడాది కూడా 70 మంది వరకూ రాజస్థాన్ యువతులు వచ్చి ఊరు శివా ర్లలో అద్దగించి సొమ్ములు వసూలు చేయడంతో వారందరినీ పోలీ సులు రైలు ఎక్కించి పంపించి వేశారు. మళ్లీ వచ్చి పట్టణంలో వసూళ్లకు పాల్పడడంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



పి.హర్షిణి, కె.జాహ్నవి, పి.సౌజన్య, పి.భానుశ్రీ, ఎస్.ప్రియాంక

ట్రిపుల్ ఐటీకి బీవీఆర్ఎం విద్యార్థినుల ఎంపిక



ఎస్ యామిని



అనూరాధ

పాలకొల్లు అర్బన్, జూలై 12 : పట్టణానికి చెందిన ఏడుగురు విద్యార్థినీలు ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారు. స్థానిక బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్లో 2024లో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పి హర్షిణీ 585 మార్కులు, కె.జాహ్నవి 584, పి.సౌజన్య 579, పి.భానుశ్రీ 579, ఎస్.ప్రియాంక 576, ఎస్.యామిని 572, జె.అనూరాధ 571 మార్కులు సాధించారని హెచ్ఎం ప్రభాకర శాస్త్రి తెలిపారు. ఈ విద్యార్థినీలు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించడంతో విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి (కాకినాడ), ఎంఈవోలు అర్ఎన్‌బిఎస్ గంగాధర శర్మ, జి.వీరాస్వామి, మున్సిపల్ కమిషనర్ విజయసారథి తదితరులు విద్యార్థినీలను, హెచ్ఎం వై ప్రభాకర శాస్త్రి, ఉపాధ్యాయులను అభినందించారు.

ఈ ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం, జూలై 12: విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం పట్టణ, మండలంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఈఈ సురేష్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని కొండాలమ్మ, మాధవాయిపాలెం, రైతుబజార్, టేలర్ హైస్కూల్, వైఎస్ కాలేజ్ రోడ్డు, పాతబజార్, పిల్లి పేట, గాంధీబజార్, చర్చిరోడ్డు, ఎన్టీఆర్ కాలనీ,గాంధీ నగర్ పీచుపాలెం, మండలంలోని సీతారాంపురం,రుస్తుంబాద, వైఎస్‌పాలెం,పసలదీవి, చామకూరిపాలెం, జెట్టిపాలెం, రామన్నపాలెం, ఎల్‌బీ చర్ల గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

మొగల్తూరు: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాళీపట్నం సబ్ స్టేషన్ పరిధిలో తూర్పు, పడమర, పాతపాడు, జగన్నాధపురం, కొత్తోట, ముత్యాలపల్లి, వార తిప్ప, మోడి, నీటితిప్ప, వారతిప్ప గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ సురేష్ కుమార్ తెలిపారు.

ఆచంట: మండలంలోని వల్లూరు, నీరుళ్ళపాలెం, వల్లూరుతోట, మట్టప ర్తివారి చెరువు, భీమలాపురం, కరుగోరుమిల్లి, కందరవల్లి, అయోధ్యలంకతో పాటు, పోడూరు మండలంలోని వద్దిపర్రులో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ బి. సురేష్ కుమార్ తెలిపారు.

పెనుగొండ: సిద్దాంతం, దొంగరావిపాలెం, ములపర్రు, ఇతర గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆకివీడు: ఆకివీడు టౌన్, సమతానగర్, గుమ్ములూరు రోడ్ ఇండస్ట్రీస్, చెరుకువాడ, కోళ్ళపర్రు, గుమ్ములూరు, రాజులపేట, అప్పారావుపేట గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 12గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ అప్సాద్‌ఖాన్ తెలిపారు.

పాలకొల్లు రూరల్: పట్టణంలోని కోడిగట్టు, మార్కు పేట, రామయ్య హాల్, యాళ్ళవానిగరువు, బ్రాడీపేట బైపాస్ రోడ్డు, పెనుమదంరోడ్డు, లక్ష్మీనగర్, బంగారు వారి చెరువు గట్టు, శంభునిపేట,మొయిన్‌రోడ్డు, వరధనం రోడ్డు, సుబ్బారాయుడు గుడి వీధి, వెంకటేశ్వర కాలనీ, పెద్ద పోస్టాఫీసు ఏరియా తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

కాళ్ల(ఉండి): కాళ్ల మండలం ఏలూరుపాడు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలు వరకు ఏలూరుపాడు, జువ్వలపాలెం, పాతాళ్లమెరక, కాళ్లకూరు, చెరుకుమిల్లి గ్రామాలలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

యలమంచిలి: ఇలపకుర్రు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి 11గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ డి.రాజీవ్ తెలిపారు.

పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెంటపాడు మండలం దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, అలంపురం, ప్రత్తిపాడు గ్రామాల్లో కరెంట్ ఉండదని విద్యుత్ శాఖ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం, జగ్గన్నపేటల్లోని సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాధవరం, ఉప్పరగూడెం, జగ్గన్నపేట గ్రామాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.

ఆక్వా రైతుల్ని ఆదుకోవాలి

భీమవరం రూరల్, జూలై 12 : గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాలకు గురవుతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శుక్రవారం భీమవరం మండలం నాగేంద్రపురంలో జరిగిన సీపీఐ మండల సమితి సమావేశంలో భీమారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆక్వా రైతులు ఆరుగాలం శ్రమించి పంట చేతికందే సమయంలో ఆక్వా పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా మారి సామాన్య, పేద ఆక్వా రైతుల నుంచి తక్కువ ధరకు రొయ్యలు కొనుగోలు చేయడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. రొయ్య ప్రతీ వంద కౌంట్‌కు కిలో 250 రూపాయల మద్దతు ధరకు కొనుగోలు చేయాలని భీమారావు డిమాండ్ చేశారు. ఆక్వా పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

పాలకొల్లు అర్బన్, జూలై 12 : ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటాలని వీవర్స్ కాలనీ జీవీఎస్‌వీఆర్ మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాల హెచ్ఎం ఆర్.భవానీ ప్రసాద్ అన్నారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో తల్లిపేరిట పర్యావరణం అనే ప్రతిజ్ఞను చేయించారు. ఈసందర్భంగా వారు నాతల్లి పేరుతో మొక్క నాటుడం ఆనందంగా ఉందని తెలిపారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

పాలకొల్లు రూరల్, జూలై 12 : పాలకొల్లు రోటరీ క్లబ్ ద్వారా రూ.40వేలు విలువైన ల్యాబ్ టాప్‌ను బీఎస్సీ, ఎంఈసీ పూర్తి చేసుకుని క్యాంపస్ ఎంపికల్లో ఐబిఎంలో సిస్టం అడ్మినిస్ట్రేటర్‌గా ఎంపికైన పెద్దిబోయిన గాయిత్రి అనే విద్యార్థినికి రోటరీ కార్యవర్గ సభ్యులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు రావాడ సతీష్, కార్యదర్శి జవ్వాజీ కళ్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, ఫాస్ట్ ప్రెసిడెంట్ మద్దాల రామ్‌ప్రసాద్, పెనుమాక రామ్మోహన్‌రావు, సుధాకర్, శ్రీవత్సవ్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఉండి, జూలై 12: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం ద్వారా అందించే పౌష్టికాహారంను ప్రతీ గర్భిణి తీసుకోవాలని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.కీర్తన అన్నారు. శుక్రవారం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లులు, గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం టౌన్, జూలై 12: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం మొగల్తూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం హామీలతో కాలయాపన చేసిందే తప్ప అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించలేదన్నారు.

డీసీసీబీ చైర్మన్ పదవి తాతాజీకి కేటాయించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

మొగల్తూరు, జూలై 12: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవిని సహకార రంగంలో అపార అనుభవం ఉన్న కలవకొలను తాతాజీకి కేటాయించాలని రామన్నపాలెం, మొగల్తూరు గ్రామాల రైతులు కోరారు. శుక్రవారం పులపర్తివారితోట దుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీతారామపురం సొసైటీ సభ్యులు, రైతు సంఘాల నాయకులు గుబ్బల చలపతిరావు (బుజ్జి), యాళ్ళ అబ్బులు, నీటిసంఘ మాజీ డైరెక్టర్ అయితం చందు, ఉప సర్పంచ్ మేకల ఆజా, కోట్ల బాపన్న, పులపర్తి రాంబాబు, ఆకన ఏడుకొండలు, కుక్కల మోహనరావు, ఇంటి గోపాలరావు, వీరవెంకట సత్యనారాయణ, గ్రంధి ప్రసాద్ తదితరులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీతారామపుం సొసైటీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడుగా పని చేసిన తాతాజీకి డీసీసీబీ చైర్మన్ పదవి ఇవ్వాలన్నారు.







పెనుమదంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల.. నరసాపురంలో ఎమ్మెల్యే నాయకర్‌కు బొకేలు అందిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. భీమవరంలో వడ్డి సుబ్బారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ వైసీపీ: మంత్రి నిమ్మల

యలమంచిలి, జూలై 12: యలమంచిలి జడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్ర వారం విద్యార్థులకు మంత్రి రామానాయుడు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అబద్ధాలకు, అసత్యాలకు బ్రాండ్ అంబాసిడర్ వైసీపీ అని పేర్కొన్నారు. నిన్న ఉచిత ఇసుక అమలు కాలేదని, మొన్న విశాఖ ఉక్కు ప్రైవేటు పరం అవుతుందని బ్లూ, బులుగు మీడి యా చేసిన ప్రచారం అబద్ధాలని తేలిపోయాయ న్నారు. నేడు తల్లికి వందనం లేదంటూ మరొక అబద్ధం, అసత్యం ప్రచారం చేయడంపై ఆయన మండిపడ్డారు. పథకాన్ని అమలులోకి రాకుండానే విషప్రచారం చేయడం తగదన్నారు.

మంత్రి నిమ్మల దృష్టికి సమస్యలు

పోడూరు: పెనుమదంలో ఏడాది నుంచి తిష్టవేసిన పలు సమస్యలను రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి శుక్రవారం గ్రామ సర్పంచ్ తానేటి బాబూరావు, ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్ వార్డుమెంబర్ తంగేటి నాగ రాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త దేవరపు దొరబాబు తీసుకెళ్లారు. మంత్రి నిమ్మల స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రొటోకాల్ పాటించాలి

నరసాపురం రూరల్, జూలై 12: ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు విధిగా ప్రొటోకాల్ పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హెచ్చరించారు. శుక్రవారం నరసాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ సోని అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని మంచినీటి ప్రాజెక్టుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ప్రాజెక్టులో సరఫరా చేసే నీటిని తాగితే ఏవ్యాధులు సోకుతాయోననే భయం ప్రజల్లో ఏర్పడిందన్నారు. ఈలోపాలను అన్నింటిని సరి చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. కొన్ని శాఖల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని వీటిని వెలికి తీయాలని తాను మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాధవాయిపాలెం రేవు పాట దారులు రూ.50లక్షలు బకాయి పడితే వాటిని ఎందుకు వసూలు చేయలేకపోయారంటూ అధికారులను ప్రశ్నించారు. మల్లవరం సర్పంచ్ సుజాత, రుస్తుంబాదా సర్పంచ్ భారతి, లక్ష్మణేశ్వరం ఎంపీటీసీ హరికృష్ణలు తాగునీటి సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. పోత్తూరి రామరాజు, జడ్పీటీసీ గుబ్బల రాధాకృష్ణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే నాయకర్ ఆదేశించారు. ఆసుపత్రి కమిటీ చైర్మన్‌గా శుక్రవారం వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆసుపత్రిలోని సమస్యలను వైద్యులు నుంచి ఆరాతీశారు. సూపరింటెండెంట్ సుప్రజ పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శం 'తాపీ చెక్కిన శిల్పం'

భీమవరం టౌన్, జూలై 12 : ఒక సామాన్య తాపీమేస్త్రి వడ్డి సుబ్బారావు రచించిన 'తాపీ చెక్కిన శిల్పం' పుస్తకం సమాజానికి ఆదర్శమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. తాపీ చెక్కిన శిల్పం గ్రంథ రచయిత వడ్డి సుబ్బారావుకు అభినందన సత్కార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 28 ఏళ్లుగా సుబ్బారావు తన వృత్తి ధర్మాన్ని పాటిస్తూ దేశ భక్తిని యువతలో ప్రేరేపించాలనే ఉద్దేశంతో మంచి పుస్తకాన్ని రచించారని అన్నారు. అనంతరం సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, కే శిరీష, డాక్టర్ గంగాధరం, వబిలిశెట్టి రామకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.



:రంగసాయిని అవార్డుతో సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

రంగసాయికి ఉత్తమ వలంటీర్ అవార్డు

భీమవరం టౌన్, జూలై 12 : సంఘ సేవకుడు, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయికి ఉత్తమ వలంటరీ ఆర్గనైజర్ అవార్డును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అందించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సదస్సులో ఈ అవార్డును అందించారు. సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో భాగస్వాములైనందున ఈ అవార్డును అందించినట్టు రంగసాయి తెలిపారు. అవార్డు అందుకున్న రంగసాయి పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు అభినందించారు.

ఉపాధి పనులు సమగ్రంగా నిర్వహించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12 :ఉపాధి హామీ పనులను సమగ్రంగా నిర్వహించి కొలతలు వేసి కూలీలకు కనీస వేతనం అందించేలా చూడాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ సిబ్బందికి సూచించారు. మండలంలోని జగన్నాథపురంలో ఉపాధి పనులను ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వెంకటేశ్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, టీఏ థామస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు దైవంతో సమానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 12 : తల్లిదండ్రులు, చదువు చెప్పిన గురువు, ఇంటికొచ్చిన అతిథి దైవంతో సమానమని శాస్త్రం చెబుతుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బొండాడ సుబ్బారావు దశమ వర్ధంతి సందర్భంగా త్యాగరాజ భవనంలో బొండాడ వెంకటేశ్వరరావు, బోండా కిషోర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గరికపాటి, ఎమ్మెల్యే అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు.

భీమవరానికి రుణపడి ఉన్నా: గరికపాటి

20 ఏళ్ల వయసులో తాడేపల్లిగూడెం నుంచి భీమవరానికి సైకిల్‌పై వచ్చేవాడినని, నాటకాల కోసం ఈ ప్రాంతానికి వచ్చేవాడినని, భీమవరం వస్తున్నా అంటే ఎంతో ఆనందంగా ఉంటుందని, ఎప్పటికీ భీమవరానికి రుణపడి ఉంటానని గరికపాటి అన్నారు. రామాయణంలో శ్రవణ కుమారుడు కథ ఒక ఉదాత్తమైన పాత్ర అని, తల్లి దండ్రుల పట్ల ఎంత అంకిత భావాన్ని కలిగి ఉండాలో చెప్పే ఒక మహోన్నత వ్యక్తిత్వమని అన్నారు.

అత్తిలిలో నిత్యావసరాల కౌంటర్ ప్రారంభం



వినియోగదారులకు సరుకులు అందిస్తున్న టీడీపీ ప్రెసిడెంట్ ఆనాల ఆదినారాయణరావు

అత్తిలి, జూలై 12 : పేదలకు తక్కువ ధరలకు నిత్యావ సరాలు అందించాలనే ప్రభుత్వ నిర్ణయంతో అత్తిలి చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు ప్రారంభించారు. అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజల ఇబ్బందులు గమనించి కూటమి ప్రభుత్వం స్టీమ్డ్ బీపీటీ బియ్యం కేజీ రూ.49, పచ్చి బీపీటీ రైస్ కేజీ రూ.48కు, దేశవాళీ కందిపప్పు రూ. 160కు అమ్మకాలు చేస్తారన్నారు. జనసేన రాష్ట్ర కౌన్సిల్ మెంబరు దిరిశాల వెంకట్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శివరాం ప్రసాదు, తూనికలు కొలతలు శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ నాగరాజారావు, డీఎస్‌వో సరోజ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌పై అవగాహన



ప్రకాశం చౌక్ సెంటర్‌లో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం క్రైం, జూలై 12 : ద్విచక్ర వాహనదారులు బండి నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, లేకుంటే ప్రమాదం జరిగితే తలకు గాయమై ప్రాణాలు కోల్పోతారని, తద్వారా వారిపై ఆధారపడ్డవారు అన్యాయమవుతారని భీమవరం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మొగళ్ళ వెంకట రమణారావు, భీమవరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి దాసు అన్నారు. శుక్రవారం నాడు భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుతుపుతున్న వాహనదారులకు చాక్లెట్లు పంచి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మీ, సీనియర్ న్యాయవాది ఉండపల్లి రమేష్‌నాయుడు, నామినేటెడ్ న్యాయవాది వీవీ సుబ్బారావు, ప్యానల్ లాయర్స్ ఎన్ సుధీర్, పి అంబేద్కర్, డి రవికిరణ్, కె జ్యోతి, ఆర్ సుబ్బయ్య, వలంటీర్ సుధామ, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ఉండిలో లయన్స్ క్లబ్ కార్యవర్గం

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఉండి జూలై 12: పర్యావరణం పరిరక్షణకు లయన్స్ సభ్యులు కృషిచేయాలని ఇంటర్నేషనల్ డైరెక్టరు పి.సుభాష్‌బాబు అన్నారు. శుక్రవారం ఉండి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. సభకు వేగేశ్న అనంతలక్ష్మీ అధ్యక్షత వహించారు. సుభాష్‌బాబు మాట్లాడుతూ ఈఏడాది కోటి మొక్కలు నాటడం, కోటిమందికి అన్నదానం చేయడం, షుగర్ వ్యాధి నిర్మూలనకు కృషిచేయడం వంటివి చేపట్టాలన్నారు. ఈపూరి సత్యనారాయణ, ఇన్‌స్టాలేషన్ అధికారి సిహెచ్‌కృష్ణంరాజు, కృష్ణమూర్తి, జడ్‌సి రామమూర్తి తదితరులు మాట్లాడారు. నూతన కార్యవర్గంలో సత్తి బ్రహ్మారెడ్డి ముదునూరి శివరామరాజు, పాలతీర్థపు నరసింగరావులు ప్రమాణం చేశారు.

ద్వారకా తిరుమలకు పాదయాత్ర

గణపవరం, జూలై 12: ఉంగుటూరు కూటమి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గెలుపొందాలని కోరుతూ మొక్కుబడులు తీర్చుకునేందుకు మండలంలోని అర్ధవరం గ్రామ కూటమి సభ్యులు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. అర్ధవరం నుంచి గణపవరం మీదుగా ద్వారకాతిరుమల తరలి వెళ్లిన కూటమి సభ్యులకు పలువురు స్వాగతం పలికారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి డాక్టర్ రమేశ్ రాక

పెంటపాడు, జూలై 12 : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 14వ తేదీ ఆదివారం విజయవాడ నుంచి ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ తీగల రమేశ్ వస్తున్నారని ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

శ్రేష్టకు 15 మంది గురుకుల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12: దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉచిత ప్రవేశాలకు నిర్వహించిన శ్రేష్ట పరీక్షలో పెదతాడేపల్లి గురుకుల విద్యార్థుల్లోని 15 మందికి తొలి కౌన్సెలింగ్‌లో సీట్లు లభించినట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు శుక్రవారం తెలిపారు. మొత్తం పాఠశాల నుంచి 139 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి వందశాతం ఉత్తీర్ణత పొందారని వివరించారు. తొలి విడతలో సీట్లు సాధించిన 13 మంది విద్యార్థులకు కేరళలోను, ఇద్దరికి ఏపీలోనూ సీట్లు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, డీసీవో భారతి, ప్రిన్సిపాల్ రాజారావు అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

యలమంచిలి, జులై 12: ఇటీవల కాజపడమర గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో పాకలు, గడ్డి వాములు అగ్నికి ఆహుతికాగా మూడు గేదెలు కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలకు టీడీపీ కుటుంబసభ్యులు సమకూర్చిన రూ.65,000 ఆర్థిక సాయాన్ని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శుక్రవారం అందజేశారు. బాధిత కుటుంబాలైన గుబ్బల కృపారావు, కడలి వేణు, కట్టా వెంకటేశ్వరరావులను మంత్రి రామానాయుడు పలకరించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గంజాయి బ్యాచ్‌లపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. వారి ఆగడాలకు అడ్డుకట్టవేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాతా రత్నంరాజు, జిల్లెళ్ళ రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి

భీమవరం టౌన్, జూలై 12 : రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ అందరి వాడని, ఆయన రాసిన రాజ్యాంగం చాలా గొప్పదని, ప్రజలందరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. దళిత ఐక్యవేదిక నాయకులు ఎమ్మెల్యే అంజిబాబును కలిసి భారత రాజ్యాంగ ప్రతిని అందజేశారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, జి రాజ్ కుమార్, ఆలమూరి బాబ్జీ, పట్టెం శుభాకర్, పాస్టర్ కే శ్రీధర్, మునియ్య, విజ్జురోతి రాఘవులు, వడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల అందజేత

ఆచంట, జూలై 12: ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకాలను శుక్ర వారం స్థానిక ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీదేవి అందజేశారు. ఆచంటకు చెందిన గొడవర్తి శ్రీరాములు ఆధ్వర్యంలో ఇస్తున్న ఆర్‌వో వాటర్ కూపన్‌లను కూడా దాత శ్రీరాములు కళాశాలకు ఇవ్వడం జరిగిందన్నారు.